
# 9. కోతి చదువు

**కింది బొమ్మను చూడండి, మాట్లాడండి.**



**ప్రశ్నలకు జవాబులు చెప్పండి**

- బొమ్మలో ఏమేం కనపడుతున్నాయో చెప్పండి.
- బొమ్మలో కనపడుతున్న వ్యక్తి గంగిరెద్దును ఏం చేయమంటున్నాడు?
- మనం చెప్పినట్లు చేసే జంతువులు ఏవి?



**విద్యార్థులకు సూచనలు**

- పాఠంలోని బొమ్మలు చూడండి.
- పాఠం చదువండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- గీత గీసిన పదాలకు అర్థాలను మీ మిత్రులనుగాని, ఉపాధ్యాయులనుగాని అడగండి. లేదా **'పదాలు–అర్థాలు'** అనే పట్టికలో చూసి తెలుసుకోండి.


SCERT TELANGANA

అనగనగా ఒక వూళ్ళో
ఉన్నాడొక పిల్లవాడు
ముద్దుచేసి తలిదండ్రులు
మురిపెంగా పెంచినారు

చదువంటే శ్రద్ధలేదు
గురువంటే లెక్కలేదు
ఎందుకు చదువని బడికి
ఎగనామం పెట్టినాడు

కన్నకొడుకు తీరుచూసి
తల్లి మనసు బాధపడెను
చదువు విలువ తెలియజెప్ప
ఉపాయాన్ని యోచించెను

కోతుల నాడించువాడు
ఒకరోజు వచ్చినాడు
మనిషి చేయగలుగు పనులు
కోతితో చేయించినాడు




SCERT TELANGANA

అంతట తల్లికి చక్కని
ఆలోచన తట్టింది
లోనికెళ్ళి పుస్తకాన్ని
తెచ్చి కోతికిచ్చింది

కోతి దాన్ని ఎగాదిగా
చూసి చించివేసింది
కిచకిచ మంటూ ఎగురుతు
కేరింతలు కొట్టింది

"ఇన్ని పనులు చేయు కోతి
చదువెందుకు చదవలేదు?"
కొడుకు ప్రశ్న విన్న తల్లి
కడకు ఇట్లు జవాబిచ్చె

"చదువుకుంటే అది కూడా
మనుషులంత గొప్పదే
మనిషికి పశువుకు తేడా
చదువంటా రందుకే!"

తల్లి మాట విన్న కొడుకు
తలవంచుకు నిలిచినాడు
చదువులోని గొప్పతనం
చక్కగ గ్రహియించినాడు!

– కె. రాజేశ్వర్‌రావు



SCERT TELANGANA

# భాషాసామర్థ్యాల సాధన

## I వినడం-ఆలోచించి మాట్లాడడం

అ) గేయం రాగయుక్తంగా పాడండి.

ఆ) మీరు కోతులను చూసే ఉంటారు కదా! కోతి చేసే పనులను చెప్పండి.

ఇ) మీరు చదువుకోవడానికి మీ అమ్మ ఏమేం చేస్తుందో చెప్పండి.

## II ధారాళంగా చదువడం - అర్థం చేసుకోవడం

### అ) గేయం చదువండి. కింది వాక్యాలు తప్పు (×) ఒప్పు (✓) లను గుర్తించండి.

1) తల్లికి చక్కని ఆలోచన తట్టింది. ( )

2) పిల్లవాడు చివరకు చదువు విలువ గ్రహించాడు. ( )

3) తల్లిదండ్రులు పిల్లవాడిని మురిపెంగాపెంచారు. ( )

4) మనిషికి పశువుకు తేడా లేదు. ( )

5) కోతి పుస్తకాన్ని దాచిపెట్టుకుంది. ( )

### ఆ) గేయం చదువండి. కింది ఖాళీలను పూరించండి.

1) కన్నకొడుకు తీరుచూసి ____________ బాధపడింది.

2) చదువు ____________ తెలియజెప్పు.

3) ____________ పశువుకు తేడా చదువు అంటారు.

4) తల్లిదండ్రులు ____________ పెంచినారు.

5) కిచకిచమంటూ ఎగురుతు ____________ కొట్టింది.

SCERT TELANGANA



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22

### ఇ) కింది పేరా చదువండి. ఇచ్చిన ప్రశ్నలకు జవాబులను రాయండి.

ఆకలిగా ఉన్న ఒక తోడేలు తిండికోసం వెతుకుతూ ఉంది. ఊరి చివర ఒక ఇంట్లో చిన్న పిల్లవాడు ఏడుస్తూ ఉండటం, ముసలమ్మ వాణ్ణి బెదిరిస్తూ "నీ ఏడుపు మానకపోతే నిన్ను తోడేలుకు ఇచ్చేస్తాను" అంటున్న మాటలు తోడేలు చెవినపడ్డాయి. దానితో తోడేలుకు ఆశపుట్టింది. ఆపకుండా ఏడుస్తున్న పిల్లవాణ్ణి ఎలాగైనా తనకే ఇస్తుందనుకొని అక్కడే గోడ పక్కన రాత్రి దాకా నిలబడింది. మళ్ళీ ముసలమ్మ మాటలు "ఏడవకురా నాన్నా! నిన్నేమీ తోడేలుకు ఇవ్వనులేరా" అది వచ్చినా దాన్ని నా కర్రతో కొట్టి చంపేస్తా "ఊర్కో నాన్నా" అన్నది. వెంటనే తోడేలు భయంతో అక్కడి నుండి వెళ్ళిపోయింది.

1) తోడేలు దేనికోసం వెతుకుతున్నది?

______________________________

2) తోడేలుకు ఎందుకు ఆశపుట్టింది?

______________________________

3) ముసలమ్మ పిల్లవాణ్ణి ఏమని ఓదార్చింది?

______________________________

4) తోడేలు ఆకలి తీరిందా? లేదా?

______________________________

5) పై పేరాకు సరియైన పేరు పెట్టండి.

______________________________

## III సొంతంగా రాయడం

### అ) కింది ప్రశ్నలకు జవాబులను రాయండి.

1) చదువుకోవడంవల్ల కలిగే ప్రయోజనాలను తెలపండి.

2) మీ అమ్మానాన్నలు అంటే మీకు ఎందుకిష్టమో రాయండి.

3) కొడుకు చదువుకోసం తల్లి ఆలోచించిన ఉపాయాన్ని వివరించండి.

SCERT TELANGANA



## IV సృజనాత్మకత

**అ) కింది పేరా చదువండి.**

ఒక అడవిలో ఒక నక్క ఉండేది. దానికి కొంగమాంసం తినాలని కోరిక. ఒక రోజున దానికి కొంగ కనబడ్డది. "కొంగ బావా, మా ఇంటికి రావా! నీకు చేపల పులుసుతో భోజనం పెడతా" అన్నది నక్క. నక్క మాటలను కొంగ నమ్మింది. నక్క ఇంటికి పోయింది. నక్క కొంగను పట్టుకొని తినబోయింది. తరువాత ఏం జరిగింది? కొంగ ఎట్లా తప్పించుకున్నది? ఊహించి రాయండి.

SCERT TELANGANA

## V పదజాలం

**అ) సూచనల ఆధారంగా గళ్ళు పూరించండి.**

1) ముఖాన్ని చూసుకునే వస్తువు.

2) చేదుగా ఉండే కాయ.


3) రెండు కన్నా తక్కువది.

4) పులి విసిరేది.

5) ఇంద్ర ధనుస్సులోని రంగులు.

| | | | | |
|---|---|---|---|---|
| | | అ | | |
| | | ర | | |
| | | టి | | |
| | | పం | | |
| | | డు | | |

### ఆ) బడికి సంబంధించిన పదాలను రాయండి.




### ఇ) కింది పదాలతో సొంతవాక్యాలను రాయండి.

ఉదా : శ్రద్ధ = ఏ పని అయినా శ్రద్ధతో చేయాలి.

1) ఉపాయం = ____________________

2) కిచకిచ = ____________________

3) ఆలోచన = ____________________

4) కేరింతలు = ____________________

5) పనులు = ____________________

## VI భాషను గురించి తెలుసుకుందాం

### అ) కింది వాక్యాలలోని నామవాచక పదాల కింద గీత గీయండి.

1) గులాబీపువ్వు అందంగా ఉంటుంది.

2) అమీర్, డేనియల్, మాధవలు ఈత నేర్చుకున్నారు.

3) గోల్కొండ కోటలో ఎన్నో విశేషాలున్నాయి.

4) ఆదిలాబాద్ జిల్లాలో చాలా మంది మరాఠీ భాష మాట్లాడుతారు.

SCERT TELANGANA

**ఆ) కింది పట్టికలోని సర్వనామ పదాలను చదువండి. ఖాళీలలో సరిపోయేచోట రాయండి.**

| ఆమె | అవి | అది | ఆయన | వారు | అవి |
|---|---|---|---|---|---|

1) చీమలు శ్రమకు మారుపేరు ____________ ఒకదాని వెనుక ఒకటి వెళతాయి.

2) నన్నయ, తిక్కన, ఎర్రనలు భారతం రాశారు. ____________ కవిత్రయంగా పేరు పొందారు.

3) చిరుతపులి పరుగెత్తుతుంది. ____________ అడవిలో ఉంటుంది.

4) లలిత ముగ్గు చక్కగా వేస్తుంది. ____________ పాట బాగా పాడుతుంది.

5) పోతన గొప్పకవి. ____________ భాగవతం రాశాడు.

6) సింహం, పులి వంటివి క్రూర జంతువులు. ____________ అడవిలో ఉంటాయి.

**ఇ) కింది గళ్ళలోని పదాలకు సరిపోయే క్రియాపదాన్ని గుర్తించండి. వాక్యాన్ని రాయండి.**

**✿ కింది వాక్యాలు చదువండి.**

సీత పుస్తకం <u>చదువుతున్నది.</u>

రాము జామపండు <u>తిన్నాడు.</u>

జానకి కథలు <u>రాస్తది.</u>

ఈ వాక్యంలో గీత గీసిన పదాలు గమనించండి. ఆ పదాలు సీత, రాము, జానకి చేసే పనుల గురించి తెలియజేస్తున్నాయి. ఇలా పనిని తెలిపే పదాలను **"క్రియా పదాలు"** అంటారు.

కింది వాక్యాలను చదువండి. క్రియా పదాల కింద గీత గీయండి.

1) మామయ్య బొమ్మలు తెచ్చాడు.

2) రేవాంశ్ సైకిలు తొక్కుతున్నాడు.

3) శివ పుస్తకం చదువుతున్నాడు.

4) ప్రజ్ఞ పాట పాడుతున్నది.

5) వైదేహి బొమ్మలు గీస్తున్నది.

6) జయ, విజయలు మొక్కలకు నీళ్ళు పోస్తున్నారు.

SCERT TELANGANA

## VII ప్రాజెక్టుపని

**బాగా చదువుకొని ప్రయోజకులైన వారు ఎంతోమంది ఉన్నారు కదా! అలాంటి వారి గురించి తెలుసుకొని చార్టుపై రాసి ప్రదర్శించండి.**

### నేనివి చేయగలనా?

| | | |
|---|---|---|
| 1) | గేయాన్ని రాగయుక్తంగా పాడగలను. | ఔను / కాదు |
| 2) | గేయం ఆధారంగా వాక్యాలలో తప్పు, ఒప్పులను ఖాళీలను పూరించగలను. పేరా చదివి జవాబులు రాయగలను. | ఔను / కాదు |
| 3) | చదువు ప్రయోజనాన్ని సొంతమాటల్లో రాయగలను. | ఔను / కాదు |
| 4) | కథను ఊహించి పొడిగించగలను. | ఔను / కాదు |
| 5) | బడికి సంబంధించిన పదాలు రాయగలను. సూచనల ఆధారంగా గళ్ళలో సరైన పదాలు రాయగలను. | ఔను / కాదు |
| 6) | నామవాచక, సర్వనామ, క్రియా పదాలను గుర్తించగలను. | ఔను / కాదు |

SCERT TELANGANA

### మంచి మాట

**మనలో ఆవగింజంత**
**ఆత్మవిశ్వాసం ఉంటే చాలు.**
**విశ్వాన్నే జయించవచ్చు.**